జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 3-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 358 పేజీలు: 4 వెల: రూ.7

## బదిలీలకు.. పోలీసుల..

# ఎదురుచూపులు






- ఐదేళ్లకోసారి బదిలీల ప్రక్రియ
- పాఠశాలలు తెరుచుకుంటుండడంతో బదిలీల కోసం వెయిటింగ్
- ఎస్పీ ముందు జాబితా?
- పలు పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత
- జిల్లా కేంద్రంలో పాతుకుపోయిన కొందరు పోలీసులు
- బదిలీ కాకుండా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

**శ్రీకాకుళం క్రైం, జూన్ 3 (వార్త):** జూన్ నెల అంటేనే బదిలీల మాసం. ఈనెల 12 నుంచి విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతి ఐదేళ్లకోసారి పోలీసులకు బదిలీలు అవుతుంటాయి. చాలా రోజుల నుంచి పోలీసులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యాసంస్థలు తెరుచుకున్న తర్వాత బదిలీలు అయితే తమ పిల్లలకు ఏ పాఠశాలల్లో చేర్పించాలి, అద్దెకు ఇళ్లను తీసుకోవాలి తదితర సమస్యలు ఉంటాయి. ఇవన్నీ ఆర్థికంగా ముడిపడి ఉన్న అంశాలే. విద్యాసంస్థలు తెరుచుకోకముందే బదిలీలు అయితే వారికి కొంత వెసులుబాటు ఉంటుంది. ఎస్పీగా కేవీ మహేశ్వరరెడ్డి శ్రీకాకుళంలో బాధ్యతలు తీసుకున్న తర్వాత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలకు బదిలీలు అయ్యాయి. అయితే కేవలం పోలీసు సిబ్బందికి మాత్రం బదిలీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. పక్క జిల్లాల్లో బదిలీలు అయినప్పటికీ ఇక్కడ మాత్రం ఇంకా ఈ ప్రక్రియలో జాప్యమవుతోంది. పోలీసుల బదిలీల ప్రక్రియకు సంబంధించి జాబితా ఆయన టేబుల్‌పై ఉందని జిల్లా పోలీసు కార్యాలయంలో కొందరు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్పీ క్యాంపులో ఉన్నారని, ఆయన వచ్చిన వెంటనే బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తుండగా, జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది ఎక్కువగానే ఉన్నట్టు కొందరు పోలీసులు చెబుతున్నారు. కొందరు అనారోగ్యం, పాస్‌పార్టు, తదితర కారణాలు చెప్పి జిల్లా పోలీసు కార్యాలయంలో తిష్ట వేసుకుని కూర్చున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నివాసముంటున్నవారే ఎక్కువగా జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నారు. వీరు ఇతర పోలీస్‌స్టేషన్లకు వెళ్లేందుకు ఆసక్తి కనబరచడం లేదు. కొందరు ఆ శాఖలోని ఉన్నత ఉద్యోగులకు, కార్యాలయంలో ఉన్న అధికారులకు తొత్తులుగా వ్యవహరిస్తుండడంతో ఇక్కడి నుంచి కదలడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. మరికొందరు కులం కార్డు వినియోగిస్తూ ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చున్నారన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. అటువంటి వారు ఎవరెవరు ఉన్నారన్న జాబితా కూడా ఎస్పీ ముందు ఉన్నట్టు సమాచారం. పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత ఏ మేరకు ఉంది, అదనపు సిబ్బంది ఎక్కడెక్కడ ఉన్నారన్న దానిపై ఆరా తీసినట్టు తెలిసింది. జాబితాను కూడా సిద్ధం చేసినట్టు సమాచారం. మహిళా సంరక్షణ పోలీసులు సైతం బదిలీల కోసం ఎస్పీ కార్యాలయంలో అర్జీలు పెట్టుకున్నారు. వారు కూడా తమను బదిలీ చేయాలని కోరుతున్నారు.

## సమయానికి రారు..

# కార్యాలయాలు తెరవరు!



- ఇదీ సరుబుజ్జిలి మండలంలో ప్రభుత్వ అధికారులు.. సిబ్బంది పనితీరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు
- ఎవరైనా నిలదీస్తే ఫీల్డ్.. అనే సమాధానం
- మరికొందరైతే మా ఇష్టం.. ఏం చేసుకుంటారో చేసుకోండని నిర్లక్ష్యపు సమాధానం

**సరుబుజ్జిలి, జూన్3 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థులను పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించవద్దని నిబంధనలు జారీ చేసి కఠినంగా అమలు చేసింది. ఎంతోమంది విద్యార్థులను వెనుదిరిగేలా చేసింది. కానీ విధుల్లో సమయపాలన పాటించని అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల సమయ పాలన వాళ్ల ఇష్టారాజ్యంగా తయారైంది. సరుబుజ్జిలిలో మంగళవారం ఉదయం 10గంటలకు ఏ ప్రభుత్వ కార్యాలయం తెరుచుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కనీసం అటెండర్ కూడా ఆ సమయానికి రాలేదు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు సమయ పాలన పాటించ కుండా పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలేగా అని తమ ఇష్టం వచ్చిన సమయానికి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని పలువురు కోరుతున్నారు.

## పరిశ్రమలు, ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై 6న సదస్సు



**- జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్**

**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు ఈ నెల 6న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్ తెలిపారు. అన్నారు. ఆరోజు ఉదయం 11 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. సదస్సులో పాల్గొన్నవారికి మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశా మన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలందరూ. వినియోగించుకోవా లని ఆయన కోరారు.

# పచ్చదనమే లక్ష్యం : కలెక్టర్ స్వప్నిల్



**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న జిల్లాను పచ్చదనంతో నింపడమే లక్ష్యంగా, మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మొక్కల సంఖ్య, వాటి లభ్యతను ఖచ్చితంగా అంచనా వేయాలని, ట్రీ గార్డులు సిద్ధం చేయాలని, సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్ పూర్తి చేయాలని సూచించారు. కాంపౌండ్ వాల్ లేని ప్రదే శాల్లో వరుసగా మొక్కలు నాటాలని, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, జూనియర్ రెడ్ క్రాస్, వెల్ఫేర్ అసోసియేషన్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)కు సంబంధించి 'యోగాంధ్ర ప్రచారం 2025' కోసం ముందస్తు సన్నాహాలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధానమంత్రి మోదీ పాల్గొనే ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస ప్రాంతాల నుంచి 20 వేల మంది యోగా అభ్యాసకులను సిద్ధం చేయాలని నిర్దేశించారు. పెన్షన్ పంపిణీలో లోటుపాట్లపై ప్రతి రోజు తనిఖీ చేయాలని, అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిశు భ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఎరువులు, విత్తనాల సరఫరాలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, మాదక ద్రవ్యాలు, మహిళలపై నేరాల నివారణకు పోలీస్ విభాగం కార్యాచరణ రూపొం దించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద వంశధార, ఇతర ప్రాజెక్టుల్లో మొక్కలు నాటడం, సీజనల్ వ్యాధుల నివారణకు వేగంగా నీటి నమూనాల పరీక్షలు చేపట్టడం, వర్షాకాలం దృష్ట్యా కాలువల శు భ్రతపై మున్సిపల్, డీపీవో సమన్వయంతో పని చేయడం వంటి అంశాలపైనా కలెక్టర్ సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ అమలును పర్యవేక్షించారు.

ఈ సమీక్షలో జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథ స్వామి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, హౌసింగ్ పీడీ నాగేశ్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయాలి






**మందస, జూన్ 3(వార్త):** కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పది గంటలకు పలాసలో వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్టు వైసీపీ జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, నియోజకవర్గ జేసీయస్ కన్వీనర్ చింతాడ గణపతి, నియోజకర్గ పంచాయతీరాజ్ కన్వీనర్ కర్రి గోపాలకృష్ణ, రాయకోల సర్పంచ్ సవర నవిత తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత పాలనపై రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో మందస మండలం నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ కన్వీనర్లు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, అనుబంధ విభాగం నాయకులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

**పలాస:** కాశీబుగ్గ వైస్సార్ కూడలి వద్ద ఉదయం 10 గంటలకు జరగనున్న "వెన్నుపోటు దినం" కార్యక్రమం విజయవంతం చేయాలని పలాస వైసీపీ అధ్యక్షులు శిష్టు గోపి అన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో లేనిపోని అబద్దాలను ప్రచారం చేసి, పథకాలు ఎక్కువగానే ఇస్తామని చెప్పి .. ప్రజలను మభ్యపెట్టి గద్దినెక్కిందన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, మోసం చేస్తూ రాష్ట్రంలో అరాచక పాలన చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా సెక్రటరీ బోర కృష్ణారావు(బుజ్జి), కౌన్సిలర్ శంకర్ పాండా, నేతలు అంబటి ఆనందరావు పోతనపల్లి హరిప్రసాద్, పిచ్చుక అజయ్, సవర సోమేశ్వరరావు, బమ్మిడి సంతోష్, శర్వాణ రవికుమార్, నర్తు వెంకటరమణ, బమ్మిడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ
# ఆరు వరుసలుగా విస్తరించండి

**❋ నీలమణి అమ్మవారి గుడి దగ్గర రోడ్డు డిజైన్ మార్పు చేయాలి ❋ కేంద్ర మంత్రి నితిన్ గాడ్కరితో రామ్మోహన్ ప్రత్యేక భేటీ**

**శ్రీకాకుళం, జూన్ 3 (వార్త):** నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రి నితిన్ గాడ్కరిని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మంగళవారం భేటీ అయ్యారు. చెన్నై కలకత్తా జాతీయ రహదారిపై ఉన్న రద్దీ దృష్ట్యా నరసన్నపేట నుండి ఇచ్ఛాపురం వరకు ఆరు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రిని కోరారు. పాతపట్నం వద్ద నిర్మిస్తున్న ఆర్ఓబి కారణంగా నీలమణి అమ్మవారి గుడి ప్రాంగణం ఎర్త్ వాల్ వల్ల మూసుకుపోవటం భక్తులకు ఇబ్బందికరంగా మారుతుందన్నారు. 110 మీటర్ల విడక్ట్ నిర్మాణం చేపట్టి ఆలయానికి నేరుగా వెళ్లే లా రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు. దీనికి సుమారు 8 కోట్ల రూపాయల అదనపు ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారని తెలిపారు. ఈ పనులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కోరారు.





## ప్రతీ కుటుంబానికి హెూం కంపోస్ట్ తప్పనిసరి

**మందస, జూన్ 3(వార్త):** ప్రతీ కుటుంబానికి హెూం కంపోస్ట్ పిట్‌తో పాటు కిచెన్ గార్డెన్ తప్పనిసరిగా ఉండాలని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. దీనిపై మహిళా సంఘ సభ్యులందరికీ పల్లె పల్లెలో అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు టైప్ వన్ కంపోస్ట్ పిట్‌లను, మిగతా వారికి టైప్ టు కంపోస్ట్ పిట్ లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ తన పెరటిలో ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా ఆకుకూరలు, కాయగూరలు, మునగ, బొప్పాయి తదితర మొక్కలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి, ఎఫ్.పి.ఓ. అకౌంటెంట్ కృష్ణకుమారి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు స్వామినాయుడు, కిషోర్, ముఖలింగం, మీనాక్షి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 48 పీడీఎస్ బియ్యం బస్తాల పట్టివేత



**కొత్తూరు, జూన్ 3(వార్త):** బలద గ్రామానికి చెందిన మాధవ హరి ఇంటి వరండాలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. 48 బియ్యం బస్తాలను సీజ్ చేశారు. ఆ బియ్యాన్ని సరుబుజ్జిలి ఎంఎల్ఎస్ పాయింట్‌కి అప్పగించారు.

## గొల్లలపాలెం వాసికి తెలంగాణలో గోల్డ్ మెడల్



**మందస, జూన్ 3(వార్త):** లోహరిబంద పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి చెందిన మామిడి పాపారావు కానిస్టేబుల్‌గా తెలంగాణాలో పని చేస్తున్నారు. పాపారావు 300 మీటర్ల ఫైరింగ్‌లో మంచి ప్రతిభ చూపారు. దీంతో గోల్డ్ మెడల్ సాధించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్బంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ఈ మెడల్ అందుకున్నారు. ఆయనను పలువురు అభినంధించారు.

## క్రీడలను విద్యార్థులు తప్పక ఆడాలి

**మందస, జూన్ 3(వార్త):** క్రీడలను విద్యార్థులు తప్పక ఆడాలని మందస శాఖా గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. ఆటలతో శారీరకంగా, మానసికంగా ధృడత్వం ఏర్పడుతుందన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ కూడా ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ గ్రంథాలయం సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 5న హరిపురంలో కవితల పోటీలు

**మందస, జూన్ 3(వార్త):** హరిపురంలో ఈ నెల5న కవితల పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రజా విజ్ఞాన వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహన్‌రావు తెలిపారు. చెప్పారు. ఆ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనదలచిన ఔత్సాహికులు 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై కవితలు రాసి 5న ఉదయం 8.30గంటలకు హరిపురంలోని శ్రీ వెంకటేశ్వర విద్యానికేతన్ స్కూల్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. పాఠశాల, కళాశాల, పీజీ స్థాయి అభ్యర్థులు పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులకు విలువైన బహుమతులు ఉంటాయని, ఆసక్తిగల అభ్యర్థులు 9398645293, 8985019835 అనే ఫోన్ నంబర్లుకు ఫోన్ చేసి ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.



## గ్రామాభివృద్ధికి సిద్ధం : బమ్మిడి

**పలాస, జూన్ 3(వార్త):** చినంచల గ్రామ అభివృద్ధికి ఎలాంటి సహాయం కావాలన్నా తాను ఎప్పుడూ ముందు ఉంటానని జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. మంగళవారం ఆయన ఆ గ్రామంలోని కొత్తవీధిలో మండపం నిర్మాణానికి రూ.22,000లు విరాళం అందజేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



**సరుబుజ్జిలి, జూన్ 3(వార్త):** పురుషోత్తపురం గ్రామ వంశధార తీరం నుంచి మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎమ్మార్వో ఆధ్వర్యంలో పోలీసులు రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.హేమవతి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డ్రోన్ నిఘా నీడలో శ్రీకాకుళం

**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** డ్రోన్ నిఘా ద్వారా శ్రీకాకుళం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 80 అడుగుల రహదారి, డచ్ బంగ్లా, వాంబే కాలనీ, కంపోస్టు, పొన్నాడ వంతెన తదితర నాగావళి నది పరీవాహక ప్రాంతాలను పోలీసులు పర్యవేక్షించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట, జూదం తదితర నేరాలు జరగకుండా నిఘా ఉంచారు. పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు.

## సంబరాల్లో అలరించిన నృత్యాలు



**ఇచ్ఛాపురం, జూన్ 3(వార్త):** డొంకపుట్టుక గ్రామ దేవత చింతామణి, కంచిలి గ్రామ దేవత కంచమ్మతల్లి సంబరాల్లో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు అద్భుత నాట్య ప్రదర్శనను అందించారు. చిన్నారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం, జానపదాలు, ఒరియా, సంబల్పూరి సినీ రీమిక్స్ పాటలకు నృత్యాలు వేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అకాడమీ వ్యవస్థాపకులు చిన్నా దంపతులు, నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్, డాన్స్ టీచర్స్ కావ్య, శైలు, పూజ, జయ, శ్వేత, లక్ష్మి, 30 మంది చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. ఈ సంబరాల్లో భక్తులు ప్రేక్షకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు సంబర కమిటీ కళాకారులను సత్కరించింది.

## క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

**ఇచ్ఛాపురం, జూన్ 3(వార్త):** స్థానిక వైయస్సార్ కళ్యాణ మండపంలో జరుగుతున్న తైక్వాండో వేసవి క్రీడా శిబిరంలో 72 మంది క్రీడాకారులకు డాక్టర్ శేషు యాదవ్ పౌష్టిక ఆహారాన్ని అందించారు. పిల్లలకు ఆరోగ్యానికి సంబంధించి వేసవి కాలంలో ఎలా ఉండాలో ఆరోగ్య సూత్రాలు తెలిపారు.



# సెమీస్‌కు చేరిన శ్రీకాకుళం జర్నలిస్టుల జట్టు

**-ఆతిథ్య జట్టు గుంటూపై ఘన విజయం.**

**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** రాష్ట్రస్థాయి మీడియా క్రికెట్ పోటీల్లో జిల్లాకు చెందిన జర్నలిస్టులు అద్భుత ప్రదర్శనతో సెమీస్‌కు చేరారు. గుంటూరులోని పోలీస్ పెరేడ్ మైదానంలో మంగళవారం ఆతిథ్య జట్టు గుంటూరు జట్టుపై ఐదు వికెట్ తేడాతో ఘనవిజయం సాధించి సెమీస్‌లోకి అడుగుపెట్టింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. బి.రాము 28, సచిన్ 22 పరుగులు చేశారు. సిక్కోలు జట్టులో చంద్రమౌళి 3 వికెట్లు, మహేశ్ 2 వికెట్లు, రాఘవ్, సాయి చెరో ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం 107 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సిక్కోలు జట్టు కేవలం 5 వికెట్లు కోల్పోయి 11.5 ఓవర్లో విజయాన్ని అందుకుంది. మహేష్ 30 బంతుల్లో 57 రన్స్ చేసి జట్టుకి అద్భుత విజయాన్ని అందించాడు. ఒకవైపు



వికెట్లు పడుతున్నప్పటికీ మహేష్ తన యొక్క పట్టుదలను విడిచిపెట్టకుండా జట్టును విజయం వైపు నడిపించారు.

బుధవారం కడప, విజయనగరం జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌లో విజేతతో సెమీఫైనల్ లో శ్రీకాకుళం జట్టు తలపడనుంది.

# డీఆర్పీలకు శిక్షణ తరగతులు



**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** అకడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్‌బుక్, అసెస్మెంట్ బుక్స్‌లోని మార్పులపై అవగాహనకు శ్రీకాకుళం గవర్నమెంట్ హై స్కూల్‌లో డీఆర్పీలకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో మారనున్న అకడమిక్ అంశాలపై హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. టీచర్ హ్యాండ్ బుక్, అసెస్మెంట్ బుక్, కరికులంలోని మార్పులపై అవగాహన పొంది శిక్షణా తరగతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, ఉప విద్యాశాఖ అధికారిణి ఆర్.విజయ్ కుమారి, టెక్కలి, పలాస ఉప విద్యాశాఖ అధికారి పి.విలియం, డిసిఇబి సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, డైట్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఏ.గౌరీశంకర్, స్టేట్ అబ్జర్వర్ గిరిజా శంకర్, డైట్ వమ్మరవల్లి అధ్యాపకులు, ఎస్ఆర్పీలు, 160 మంది డీఆర్పీలు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో రోహిట్

**-1627వ ర్యాంక్‌తో**

**సత్తా చాటిన ఉద్దానం కుర్రాడు**



**మందస, జూన్ 3(వార్త):** మందస మండలంలోని దున్నవూరు పంచాయతీ మొగలిపాడు గ్రామానికి చెందిన నూకల రోహిత్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మంచి ప్రతిభ చూపించాడు. ఓబీసీ కేటగిరిలో 1627వ ర్యాంక్ సాధించాడు. ఆయన తండ్రి హేమ సుందర్ కాశీబుగ్గలో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నారు. రోహిత్‌ను ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు బోనెల గోపాల్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# పోలుమూరు వారి సిరిమాను సంబరాలు షురూ

**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** గత నెల ఆరు నుంచి ఈనెల10 వరకు పెద్దమ్మ తల్లి, సన్నాలపోలమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి ఉత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సోమవారం నూకాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లిని ఆయా దేవాలయాల నుంచి దేవరలను ఊరేగింపుగా తీసుకువచ్చి చదురు గుడి వద్ద ప్రతిష్టించారు. సోమవారం సాయంత్రం 8 గంటలకు నూకాలమ్మ గుడి వద్ద ప్రారంభమైన అమ్మవారి ఉత్సవ ఊరేగింపు నక్క వీధి, దండి వీధి, మాఊరు వీధి, కలెక్టర్ బంగ్లా మీదుగా కొత్తపేట, కునుకుపేట గ్రామాల మీదుగా నక్క వీధి వద్ద ఉన్న చదురు గుడికి మంగళవారం ఉదయం 8 గంటలకు చేరు కుంది. అమ్మవారిని ముగ్రాటలతో, దండకంతో ఘన స్వాగతం పలికారు. పోలు మూరు వారి ఆడపడుచుగా కీర్తిస్తున్న నూకాలమ్మ అమ్మవారి సిరిమాను ఉత్సవం ఈనెల 10న నిర్వహించడానికి ఉత్సవ కమిటీ తీర్మానించింది. పెద్దమ్మ వారి సిరిమాను కూడా అదే రోజు నిర్వహించనున్నారు. పెద్దమ్మతల్లి సిరిమాను మావూరు వారి కుటుంబ సభ్యులు, నూకాలమ్మ అమ్మవారి సిరిమాను పోలుమూరు వారి కుటుంబ సభ్యులు అధిరోహించడం దశాబ్దాల కాలంగా ఆనవాయితీగా ఉంది. రాత్రంతా జరిగిన ఊరేగింపులో కర్ర సాము, కత్తి సాము, వివిధ కోలాటాలు, వేషధారణలు, ఆర్కెస్ట్రా తదితర కార్యక్రమాలు అలరించాయి. మంగళవారం ఉదయం కాజీపేట వద్ద సిరిమానుగా గుర్తించిన చింత చెట్టు వద్దకు పెద్ద ఎత్తున భక్తుల చేరుకుని పూజలు చేసి మానును నక్క వీధికి తరలించారు. ఈ



ఊరేగింపులో రామకృష్ణ, అచ్యుతరావు, జగదీశ్వర రావు, విశ్వేశ్వరరావు, గోవిందరాజులు, విజయ కుమార్ దంపతులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు నక్క శంకర్రావు, పంకజాక్ష దేవ్, గోవింద మల్లిబాబు, సాధు గణేష్, మావూరు కుమార్ స్వామి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కోర్టు ఆవరణలో రేపు పర్యావరణ దినోత్సవం

**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలోఈ నెల 5న ఉదయం 9:30 గంటలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తెలిపింది.

కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జిలు, పీఎల్ఏపీఎస్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జిలు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, ప్రభుత్వ పరాధీన న్యాయవాది, ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్, పబ్లిక్ రిలేషన్ అధికారి పాల్గొంటారని పేర్కొంది. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన పర్యావరణాన్ని కాపాడాలని న్యాయ సేవాధికారి పిలుపునిచ్చారు.

## శ్రీకూర్మానికి పూర్వ వైభవం తీసుకువస్తా

**-ఎమ్మెల్యే గొండు శంకర్**

**-క్రికెట్ పోటీలు ప్రారంభం**



**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** శ్రీకూర్మంకు పూర్వ వైభవం తీసుకువస్తామని, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకూర్మం అమ్మవారి ఉత్సవాలలో భాగంగా స్థానిక గ్రౌండ్‌లో గ్రామ ప్రజలు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రపంచంలో శ్రీకూర్మం దేవస్థానానికి ప్రాముఖ్యత ఉందని, ఈ క్షేత్రానికి అన్ని విధాలుగా సహకారమందిస్తామన్నారు. యోగాంధ్రను ఒక రోజు ఇక్కడ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామాధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఈగల్, సంకల్పం పోస్టర్లు ఆవిష్కరణ




**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** పెద్ద గణగళ్లవాని పేట తీర ప్రాంతంలో మంగళవారం ఉదయం మత్స్యకారులతో జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. “మాదక ద్రవ్యాలు నిఘా,నివారణ నియంత్రణ, వినియోగంతో అనర్థాలను తెలిపే పోస్టర్ (గోడ పత్రికలు)ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎస్పీ సి.హెచ్.వివేకానంద్ జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, డ్వామా పీడీ సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఏడీ కె.కవిత, ఆయుష్ డాక్టర్ జగదీష్, సీఐలు పైడిపు నాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తీర్మానాలు వైసీపీవి.. పథకాలు టీడీపీ నాయకులవా..?

**-మండల సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ**



**పలాస, జూన్ 3(వార్త):** ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ అధికారులను నిలదీశారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు సిఫార్సు చేసిన వారికి ఇవ్వకుండా అధికార పార్టీకి చెందిన వ్యక్తులకే కేటాయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇక నుంచి తమ సిఫార్సులను పట్టించుకోకపోతే తీర్మానాలు చేయమన్నారు. గోశాలలు నిజమైన లబ్ధిదారులకు ఇచ్చారా అంటూ ఏపీవో శంకరరావును ప్రశ్నించారు. అన్నదాతకు అండగా ఉంటామని చెబుతున్న కూటమి ప్రభుత్వం రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయలేదని వ్యవసాయ శాఖ ఎఓ పోలారావును నిలదీశారు. చివరకు రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులు, దళారులకు ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది అన్నదాత సుఖీభవ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. శివారు భూములకు సాగునీరు అందేలా ప్రతిపాదనలు ఎందుకు చేయలేదని వంశధార ఏఈ మీనాక్షిను నిలదీశారు. బొడ్డపాడు సర్పంచ్ తామడ మదన్ మాట్లాడుతూ రేషన్ సరుకులు ఇవ్వాలని అడుగుతుంటే డీలర్ ఇక్కడ రేషన్ ఇవ్వడం కుదరదని చెబుతున్నారని, లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలని కోరారు. చినంచల ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నిరంతరం అంతరాయం కలుగుతోందని, ఇష్టానుసారంగా బిల్లులు వస్తుండడంతో వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ శాఖ ఏఈ వివేకానందను నిలదీశారు. విద్యాశాఖకు సంబంధించిన పథకాల కోసం మండల విద్యాశాఖాధికారి సీహెచ్ శ్రీనివాసరావు వివరిస్తుండగా దుర్యోధన స్పందిస్తూ గత ప్రభుత్వంలో ఉన్న పథకాల్ని పేర్లు మార్చి పెడుతున్నారే తప్ప అదనంగా ఏమైనా పెట్టరా, గత ఏడాది తల్లికి వందనం ఇవ్వకుండా కాలయాపన చేశారని, ఈ ఏడాదైనా విద్యా సంవత్సరం ముందు ఇస్తారా లేదా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీడీవో వసంతకుమార్, మండల ప్రత్యేకాధికారి పోతనపల్లి చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, వైస్ ఎంపీపీ సవర దాలమ్మ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పాత శాసనంలో వైభవంగా జలయాత్ర

**ఇచ్ఛాపురం, జూన్ 3(వార్త):** బాలబ్రహ్మానంద సరస్వతీ నేతృత్వంలో శాసనేశ్వరి మాత దేవాలయం ప్రతిష్ఠలో భాగంగా పాతశాసనం గ్రామంలో ప్రజలు బాహుదా నదికి చేరుకొని పాత్రలతో జలం తీసుకొచ్చి జలాదివాసం జరిపారు. గంగా పూజలు చేసి, హారతి ఇచ్చారు. యాగశాల ప్రవేశం, గణపతి పూజా యాగం అంకురార్పన గావించారు. ప్రభుత్వ విప్ బెందాలం అశోక్‌బాబు పాల్గొని వేదపండితుల ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో డి.కామేశ్వరరావు, ఎస్ సహదేవ్, పి.బాబ్జీ, పి.దీప, ఆశి మాధవ రెడ్డి, రంగాల ధర్మారావు, ఇ.సారథి, రంగాల బాలరాజు, పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులు సక్రమంగా అందజేయాలి

**ఇచ్ఛాపురం, జూన్ 3(వార్త):** ఈ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీలోపు 65 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు తహశీల్దార్ వెంకటరావు ఆదేశించారు. ఒకవేళ వారు కుటుంబ సభ్యులు డిపో వద్దకు వస్తే సరుకులు ఇవ్వాలని సూచించారు. కార్డుదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా ఈ సూచనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సిక్కిం వరదలలో చిక్కుకున్న తెలుగు వారు

**-గాంగ్‌టక్‌కు సురక్షితంగా తరలించిన మంత్రి రామ్మోహన్‌నాయుడు**



**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** విజయనగరం తహసీల్దార్ కూర్మనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి సిక్కిం విహారయాత్రకు వెళ్లి, అక్కడి వర్షాలతో ఏర్పడిన వరదలలో చిక్కుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెంటనే స్పందించి, కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖలతో సంప్రదించి, ఆ వరదల్లో చిక్కుకున్న ఎనిమిది మంది తెలుగువారిని సురక్షితంగా గాంగ్‌టక్‌కు తరలించే చర్యలు చేపట్టారు.

## ఆదిత్యుని అన్నదానానికి రూ1,01,116 విరాళం



**శ్రీకాకుళం, జూన్ 3(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారి శాశ్వత అన్నదానం పథకానికి శ్రీకాకుళంనకు చెందిన నడింపల్లి జ్యోతి రూ.1,01,116లు విరాళం అందించారు. మంగళవారం ఆమె ఆ చెక్కును ఆలయ సీనియర్ సహాయకులు శోభనాచార్యులుకు అందజేశారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను అందజేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

## మహిళా సమాఖ్యల ప్రగతిపై సమీక్ష

**కొత్తూరు, జూన్ 3 (వార్త):** కొత్తూరులోని మండల మహిళా సమాఖ్య వద్ద ఎంటీ సూర్యనారాయణ అధ్వర్యంలో డివిజన్ లెవెల్ రివ్యూ మీటింగ్ మంగళవారం జరిగింది. అడిషినల్ డీపీఎం ధనుంజయరావు, ఎన్ఎఫ్ఏ శివకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.మే నెల ప్రగతిపైన వారు సమీక్షించారు. ప్రగతి ఇంకా మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఖాళీగా వున్న పలు గ్రామ సంఘాలలో లీడ్ ఫార్మర్ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్పీటీ, లీడ్ ఫార్మర్‌లు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546